# తూర్పు సంకేతం

అసిరయ్య బీడీ వెలిగించి, గుండెల దాకా పొగపీల్చి, బయటకు వదిలాడు.

వాతావరణం చల్లగావున్నా, బీడీ తాగుతుంటే వెచ్చగా వుంది. అదీకాక అసిరయ్య భుజాలకు తగులుతూ, మాలచ్చిమి నడుస్తుంటే, యింకా వెచ్చగా వుంది అతనికి.

రాత్రి ఒంటి గంట దాటింది. రెండో ఆట సినిమా చూసి వస్తున్న జనం తప్ప వేరే ఎవరూ లేరు రోడ్డు మీద - అక్కడక్కడా రిక్షాల శబ్దం వినపడుతున్నది.

"మాలచ్చిమీ - ఎనాగుందే చినిమా" - మాలచ్చిమని అనుకుని నడుస్తూ, ప్రేమగా అడిగాడు అసిరయ్య.

"సానా బాగుండాది మావా - కానీ ఆ ఆడకూతురు గుడ్డలిప్పుకుని సేసిన డాన్సు మాత్తరం బాగాలేదు."

"నాకు మాత్తరం ఆ డానుసు బలే బాగుండాది!" అన్నాడు అసిరయ్య చిలిపిగా.

మాలచ్చిమి చటుక్కున తెలత్తి, అసిరయ్యని చురుగ్గా చూసి - "చీపా" - అంది

మెయిన్ రోడ్డు దాటి ప్రక్క సందులోకి తిరిగారు అసిరయ్య, మాలచ్చిమి.

"మాలచ్చిమీ" గోముగా పిలిచాడు అసిరయ్య.

"ఊ !" అంది ముద్దుగా మాలచ్చిమి.

"మన పెళ్లయి యియాల్టికి ఏడ్రోజులే గందా అయింది - ఏటే ఈ ఏడ్రోజుల్లోనూ నీమీన పేమ యినాగ పెగిపోతుండాది!" అసిరయ్య నడుస్తూనే, మాలచ్చిమి నల్లటి, నున్నటి నడుం మీద చేయి వేశాడు.

గరుగ్గావున్న అసిరయ్య చేతి మీద, తన చేయి వేస్తూ, "సెప్పనా మావా - పొద్దుగుంకేదాకా కట్టెల కొట్లో రెక్కలొంచి పంచేస్తవ్ - రాత్రిళ్ళు నా పక్కన చేరతవ్, మరి నా మీన పేమ పెరక్క ఏటవుద్ది!" అని కొంటెగా నవ్వింది.

నడుము మీద నుంచి చేయి తీసి, ఆమె భుజం మీద వేసి దగ్గరకు లాక్కున్నాడు అసిరయ్య.

"ఏటిమావా - రోడ్డు మీన సరసాలు - నడు నడు - ఎవుడన్నా సూత్తే ...." సుతారంగా అతని చేతిని విడిపించి, ముందుకు నడవసాగింది మాలచ్చిమి.

"సూత్తేఏటే - మనం పరాయోల్లమేటీ - మొగుడు పెళ్లాలమేగందా..." దూరంగా సైకిళ్ల మీద వస్తున్న ఇద్దరు పోలీసులను చూసి ఆగాడు అసిరయ్య.

లైట్లులేని సైకిళ్ల మీద వస్తున్న ఇద్దరు పోలీసులు అక్కడ ఆగారు.

బుర్రమీసాల పోలీసాయన అడిగాడు - "ఎక్కడ్నించిరా వస్తున్నారు" అని.

అసిరయ్య ఇద్దరికీ దణ్ణం పెట్టి అన్నాడు - "చినిమాకెల్లొత్తున్నాం దొరా"

"ఇప్పుడే సినిమారా - ఒక్కటిన్నర దాటితే" ప్రక్కనే వున్న చట్టిముక్కు పోలీసాయన అన్నాడు.

"అదు సినిమా యిప్పడే వొదిలిండు దొరా!" అన్నాడు అసిరయ్య.

బుర్ర మీసాలాయన, మాలచ్చిమిని మునిసిపాలిటీ గుడ్డి వెల్తురులోనే క్రింద నుంచీ పైదాకా దీక్షగా చూశాడు. చూడటం అయాక అడిగాడు -

"ఈ ఆడకూతురెవర్రా" అని.

"నా పెల్లాం దొరా" మాలచ్చిమి చేయి పట్టుంటూ అన్నాడు అసిరయ్య.

భళ్లున నవ్వాడు బుర్రమీసాల పోలీసు. అతనెక్కిన సైకిల్ అటూ, ఇటూ ఊగింది ఆ నవ్వుకి.

ఆ సైకిల్ ఊగటం చూసి, ప్రక్కనున్న సైకిల్ కూడా ఊగింది. ఆ సైకిల్ మీదవున్న పోలీసాయనకూడా నవ్వుతున్నాడు.

"ఏరా నిజంగా అది నీ పెల్లామేనా" అడిగాడు చట్టిముక్కు పోలీసాయన.

అసిరయ్య ఈసారి మాట్లాడలేదు. 'అవు'నని తల మాత్రం వూపాడు.

"నీలాంటోళ్లు మాకు కొత్త కాదురా - నిజం చెప్పు - అదెవర్రా" నవ్వుతూ అడిగాడు బుర్రమీసాలాయన.

మాలచ్చిమి నెమ్మదిగా అన్నది - "ఈడు నాబరతేనయ్యా. మాకు పెల్లయి ఏడ్రోజులే అయినాది!"

బుర్రమీసాలాయన సైకిల్ మీద నుంచి దిగాడు. మాలచ్చిమిని ఎగాదిగా చూశాడు. ఆమె కండలు నిండుగా వున్నాయి. గుండెలు ఎత్తుగా వున్నాయి. నల్లగా నిగనిగ లాడుతోంది. చక్కటి అవయవాల పొందికతో పిటపిట లాడుతోంది.

"ఏరా - నువ్వు చెప్పింది నిజమేనా" అడిగాడు.

"పెమానం దొరా ఇది నాపెల్లామే ...."

"నీ పెల్లామేనని రుజువేమిట్రా"

నల్లటి చేత్తో గుండెల మీద పమిటె పక్కకుతోసి ఇంకా పచ్చగావున్న పసుపుకొమ్ముని చూపించింది మాలచ్చిమి.

పసుపు కొమ్మును దాటి లోపలి అందాలు చూస్తున్న బుర్రమీసాలాయన కళ్లు ఎర్రబడ్డాయి.

చట్టిముక్కు నవ్వాడు.

"పసుపుకొమ్ముదేముంది - ఏకొట్లోనయినా దొరుకుతంది!" అన్నాడు.

"పదండి స్టేషన్‌కి" అన్నాడు బుర్రమీసాలాయిన, ఇక ఆగలేక.

ఇద్దరినీ స్టేషన్‌కి ఎందుకు రమ్మంటున్నారో అర్థంకాలేదు. కానీ స్టేషన్‌కి రమ్మంటున్నారని మాత్రం అర్థం అయింది.

వణుకుతున్న కంఠంతో అడిగాడు - “టేసన్ కెందుకుదొరా! మేవేం తప్పు సేసినం” అని.

“ఇమ్మారల్ ట్రాఫిక్ ఏక్ట్” అన్నాడు బుర్రమీసాలు, ఒకసారి దువ్వుకుని.

అంటే ఏమిటో అక్కడున్న ఎవరికీ అర్థం కాలేదు.

అసిరయ్య కొంచెం బింకంగా అన్నాడు - “నేనేడా దొంగతనం సేయినేదు దొరా!”

“నిజం దొరా - మమ్మల్నొగ్గేయండి!”అన్నది మాలచ్చిమి దణ్ణం పెడుతూ.

“ఒగ్గేయడానికి నేనెవుడ్నే - స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ బాబుగారున్నారు - వారితో చెప్పుకోండి - పదపద” అన్నాడు బుర్ర మీసాల పోలీసు, అసిరయ్యనూ, మాలచ్చిమినీ పోలీస్ స్టేషన్ కేసి అదలిస్తూ.

“మేవేం తప్పుసేయనేదు దొరా ...” అన్నది మాలచ్చిమి.

“ఒక ఆడకూతురు - అర్థరాత్రి ఒక మొగాడితో తిరుగుతూ వుంటే అర్థమేమిటే ... యిలాటి వాళ్ళని పట్టుకోటానికే కదా మేం వున్నది!” అన్నాడు చట్టిముక్కు పోలీసు.

మాలచ్చిమి నున్నటి భుజాల్ని చూస్తున్న బుర్రమీసాలు “పదపద” అన్నాడు.

“నేనలాటి దాన్నికాదు బాబూ - ఈడు నా మొగుడే!”

“మేం నిజంగా చినిమా నుంచే వత్తున్నాం దొరా.”

“అవన్నీ స్టేషన్‌లో చెప్పుకోండి - యిక్కడ కాదు.”

“మీకు అనుమానంగా వుంటే బుర్రిపాలెం పోదాం పదండి దొరా - కోటిగాడ్ని అడుగుదాం - నరసమ్మ నడుగుదాం - వెంకడ్ని అడుగుదాం - మేం మొగుడూ పెళ్లాలమో కాదో...”

“బుర్రిపాలెం లేదూ, గొర్రిపాలెం లేదూ పోరా - కోటిగాడ్నడగాలా నాకు తెలీదూ - పదపద-”

“నా మాట యిను దొరా”

“ఏట్రాయినేది పదపద... మొండికేస్తే అనవసరంగా దెబ్బలు తింటావ్”

చెట్ల మీద కాకులు, ఆకాశంలోని నక్షత్రాలు కూడా ఈ దృశ్యాన్ని గమనించకుండా కదలకుండా వున్నాయి.

రోడ్డు మీద వేరే జనసంచారం లేదు. అక్కడో కుక్క , యిక్కడో కుక్క అప్పుడప్పుడు మొరుగుతున్నాయి.

చిక్కటి చీకటిని, చీల్చలేక మునిసిపాలిటీ దీపాలు, తలలు వంచుకుని నిలబడ్డాయి.

అసిరయ్య కానీ, మాలచ్చిమీ కాని ఎంత చెప్పుకున్నా ఇనే స్థితిలో లేరు ఆ ఇద్దరు పోలీసులూ. పోలీసు స్టేషన్‌కి లాక్కుపోయారు.

“ ఇన్‌స్పెక్టర్ గారితోనే చెప్పుకుంటాం” అన్నాడు అసిరయ్య.

“నీ కోసం ఈ అర్థరాత్రి ఆయన వస్తాడ్రా .... చెప్పుకుందువుగాని - పద ఆ గదిలోకి. ఆయన రేప్పొద్దున్న కానీ రాడు - అప్పుడు చెప్పుకో.... అప్పటిదాకా అందిలో పడుండు.”

వెనకవున్న లాకప్‌లోకి తీసుకెళ్ళి దాంట్లోకి తోసి, గడియపెట్టి, తాళం వేశాడు

చట్టిముక్కు పోలీసు.

అసిరయ్య వున్న గదిలోని లైటు కూడా ఆర్పేశాడు.

"మాలచ్చిమిని కూడా యాడనే వుంచండి దొరా...." అని అరుస్తున్నాడు అసిరయ్య.

అతని మాటలు వినిపించుకోటానికి, అక్కడ ఎవరూ లేరు. చిక్కటి చీకటి తప్ప!

అలా ఆ చీకటి కొట్లో ఎంతసేపున్నాడో తెలియలేదు అసిరయ్యకు. కాసేపు పళ్లు కొరుక్కున్నాడు - చొక్కా చించుకున్నాడు. కానీ ఎక్కువ సేపు ఏడుస్తూ కూర్చున్నాడు.

చాలాసేపయిన తరువాత లైటు వెలిగింది.

బుర్ర మీసాల పోలీసు వచ్చి తలుపు తీశాడు.

అసిరయ్యను చూసి "పోపో - యికనైనా బుద్ధిగా వుండు - యిలాంటి పనులిక చేయకు" అన్నాడు.

"మా లచ్చిమి ఏది?"

"వరండాలో వుంది పో - మళ్ళీ ఇన్‌స్పెక్టర్‌గారు వస్తే మీ ఇద్దర్నీ లోపల పెట్టమంటారు. ఆయన వచ్చేలోగానే యింటికి పొండి. ఏదోలే పోనీలే అని దయ తలచి వదిలేస్తున్నాను" అన్నాడు.

వరండాలో తలవంచుకు కూర్చుని వుంది మాలచ్చిమి.

"పదవే!" అన్నాడు అసిరయ్య.

మాలచ్చిమి, ఆ చీకట్లో లేచి నుంచున్నది.

ఆమె భుజం మీద చేయి వేశాడు అసిరయ్య.

అక్కడక్కడా, సన్నటి వెలుగు రేఖలు - తెల్లవారబోతున్నది. కాకులు అరుస్తున్నాయి.

ఆ కాకుల అరుపుల మధ్యన, నెమ్మదిగా అసిరయ్యతో చెబుతున్న మాలచ్చిమి, ఒక్కసారి అతన్ని కావలించుకుని భోరుమన్నది.

"మొత్తం నలుగురు మావా!" అన్నది వెక్కిళ్లు ఆపుకుంటూ.

అసిరయ్య వళ్లు అంత చలిలోనూ, వేడెక్కింది - గుప్పిళ్ళు బిగించాడు.

భయంకరంగా నోరు తెరుచుకుని తరుముతున్న కుక్కకు అందకుండా పరుగెడుతున్నది ఆవు.

పరుగెత్తీ, పరుగెత్తీ అలసిపోయింది.

ఇక ఓపిక లేక ఆవు ఆగిపోయింది.

ఆవు ఆగటం చూసి కుక్క కూడా ఆగింది.

ఆవు వెనక్కు తిరిగి రెండడుగులు ముందుకు వేసింది.

అది చూసి కుక్క బెదురుగా రెండడుగులు వెనక్కి వేసింది. కొమ్ములు విసురుతూ, కుక్క మీదకు దూకింది ఆవు.

కుక్క వెనక్కి తిరిగి కాలి సత్తువ కొద్దీ పరుగెత్తసాగింది.

అసిరయ్య పిడికిళ్లు బిగుసుకున్నాయి.

తూర్పున, తెల్లవారుతున్నది!